# అభ్యుదయం
The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ   బుధవారం 07-10- 2026   సంపుటి : 6   సంచిక : 236   ఎడిటర్ : ఆనంద్ రావు   పేజీలు : 8   వెల : 3-00


## స్త్రీ శక్తి కి విశేష ఆదరణ




- స్త్రీ శక్తి తో కూటమి విజయానికి మహిళలే సాక్ష్యం
- 100 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి కావడం చారిత్రాత్మకం
- భారం కాదు బాధ్యతతో స్త్రీ శక్తి పథకం కొనసాగుతుంది
- మహిళ మూర్తులకు ఆర్థిక భరోసా కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం
- మంత్రి మండిపల్లి

## ఎలక్ట్రిక్ ఆటోలతో మెరుగుపడుతోన్న ఇంటింటి చెత్తసేకరణ

-కర్నూలు నగరానికి 91 ఆటోలు మంజూరు

-9.5 ఎకరాల్లో రూ.8 కోట్లతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

-రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్




## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ

- వాటి గుర్తింపునకు సర్వే చేయండి. ● రెవెన్యూ అధికారులకు సీఎం ఆదేశం
- కేసీఆర్ ఫాంహౌస్ ఉన్న ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో ముగిసిన సర్వే
- 343 ఎకరాలే ఉందన్న అధికారులు ● రికార్డులకు, భూమికి మధ్య వ్యత్యాసం
- భూరికార్డులు సమర్పించాలంటూ కేసీఆర్, కుటుంబీకులకు నోటీసులివ్వాలని నిర్ణయం
- సర్వే నంబరు 325లో మిగిలే భూమిలో అమరవీరుల కాలనీ
- సకల సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం





హైదరాబాద్, **అభ్యుదయం**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో వారి ఫాంహౌస్ భూములకు సంబంధించిన రికార్డులను అప్పగించాలని కోరనున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల ఆచూకీ లభ్యం కాకపోవడమే ఇందుకు కారణం. శాసనసభలో గత నెల 16వ తేదీన 22ఏపై నిర్వహించిన చర్చలో భాగంగా కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. దాంతో, అక్కడి భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కూడా నిర్వహిస్తున్నారు. విచారణ, సర్వే పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.


మిగతా 2లో


## ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి

-నగర వనాల్లో స్వచ్ఛమైన, ఆహ్లాదకర వాతావరణం

-అన్ని ప్రాంతాలను కలిపేలా పర్యాటక అభివృద్ధి

-నగరవనాలను వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



అమరావతి,**అభ్యుదయం**

రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతోపాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగరవనాలను ఉప ముఖ్యమంత్రి మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా ప్రారంభించారు.


- మిగతా 2లో పేజీలో


## రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు



**కోహిర్‌లో 15.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత**

**టేకులపల్లిలో అత్యధికంగా 37 డిగ్రీలు**

**32 జిల్లాల్లో ఎండ తీవ్రతపై ఎల్లో అలెర్ట్**


మిగతా 2లో


## కానిస్టేబుల్‌కు అండగా కేటీఆర్..




హైదరాబాద్, అక్టోబర్ 6 **అభ్యుదయం:** డ్యూటీలో ఉండగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్‌కు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. శంకర్ వైద్యానికి అయ్యే ఖర్చును వ్యక్తిగతంగా భరిస్తానని ఎక్స్ వేదికగా మంగళవారం ప్రకటించారు. బాధితుడు పూర్తిగా కోలుకొని సాధారణ స్థితికి వచ్చే వరకు ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి తెలుపాలని పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు. శంకర్‌ను కుటుంబ సభ్యులు పలు దవాఖానల చుట్టూ తిప్పినా బెడ్ల కొరత, ఈహెచ్ఎస్ సమస్యల కారణంగా సరైన సమయంలో వైద్యం అందలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్‌ను కాపాడుకొనేందుకు బంధువులు, తోటి కానిస్టేబుళ్లు రూ. 1.5 లక్షలు సమకూర్చి ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న ఆయనకు మరింత చికిత్స అవసరం కావడంతో సిబ్బంది విరాళాలు సేకరిస్తున్నారు. కానిస్టేబుల్ శంకర్ చికిత్స బాధ్యతను కేటీఆర్ తీసుకోవడంపై కుటుంబ సభ్యులు, సహచర పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు

ఈహెచ్ఎస్ విఫలంపై ఆర్ఎస్పీ ఆగ్రహం

ఉద్యోగులు, పోలీసులకు ఆరోగ్య భరోసా కల్పించాల్సిన ఈహెచ్ఎస్ వ్యవస్థ విఫలమైందని ఆర్ఎస్పీ మండిపడ్డారు. శంకర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఉన్నతాధికారు లు స్పందించలేదని ఆరోపించారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం



-శాంతి భద్రతల విఘాతానికి, అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు

-ఓర్వలేక పోతున్న జగన్

-మంత్రి సవిత


2లో


## రాజకీయ పార్టీల ప్రతినిధుల భేటీపై ఈసీ కీలక ప్రకటన

రాజకీయ పార్టీల ప్రతినిధుల భేటీపై కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు కీలక ప్రకటన

మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ తమతో భేటీ





2లో

# స్త్రీ శక్తి కి విశేష ఆదరణ

అమరావతి, రాష్ట్రంలో మహిళల కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని అధిగమించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రారంభించిన స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోందని మంత్రి తెలిపారు. గతేడాది ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 100 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదు కావడం పథకం విజయానికి నిదర్శనమన్నారు.
ప్రతిరోజూ సగటున 24 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని, ఇప్పటివరకు మహిళలకు సుమారు రూ.3,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం కలిగిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలపై కుటుంబ ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ, వారి అవసరాలకు ఆర్థిక స్వేచ్ఛను కల్పించడంలో ఈ పథకం కీలకంగా మారిందన్నారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను కేవలం హామీలుగా కాకుండా బాధ్యతగా భావించి అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని మంత్రి స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొంత భారాన్ని భరిస్తున్నప్పటికీ, మహిళల సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు.
ఆర్టీసీపై నెలకు సుమారు రూ.160 కోట్ల మేర భారం పడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం రూ.2,160 కోట్లను ఆర్టీసీకి చెల్లించడం ద్వారా పథకం అమలుకు పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వానికి భారంగా భావించకుండా, మహిళల సంక్షేమం కోసం బాధ్యతగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలన్నింటిలోనూ విశేష ఆదరణ:
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో స్త్రీ శక్తి పథకం మహిళల నుంచి అత్యధిక ఆదరణ పొందుతున్న పథకాలలో ఒకటిగా నిలిచిందని మంత్రి మండిపల్లి అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాల కోసం, ఉద్యోగాలు, విద్య, వైద్యం, ఇతర పనుల నిమిత్తం ప్రయాణించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు.
మహిళల ప్రయాణ ఖర్చు తగ్గడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితికి కూడా ఈ పథకం అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళా సంక్షేమం, సాధికారతకు స్త్రీ శక్తి పథకం ఒక మంచి ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు:
స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రోజుకు లక్షలాది మంది మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించేలా ఆర్టీసీని బలోపేతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్త్రీ శక్తి పథకం మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, మహిళలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.
స్త్రీ శక్తి పథకాన్ని ఆదరిస్తూ 100 కోట్ల ఉచిత ప్రయాణాల మైలురాయిని చేరేలా చేసిన రాష్ట్రంలోని ప్రతి మహిళకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆశీస్సులతో ఈ పథకం మరింత విజయవంతంగా కొనసాగుతుందని ఆయన ఆకాంక్షించారు.

## ఎలక్ట్రిక్ ఆటోలతో మెరుగుపడుతోన్న

# ఇంటింటి చెత్తసేకరణ

కర్నూలు, కర్నూలు నగరంలో కొత్తగా ఎలక్ట్రిక్ ఆటోలు అందుబాటులోకి రావడంతో ఇంటింటి చెత్తసేకరణ మరింత పటిష్టంగా జరుగుతోందని, ఇంటింటి చెత్తసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణలో 5.6 శాతం మెరుగుదల నమోదైందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక, జొహరాపురం రోడ్డులో ఉన్న జీటీఎస్ స్టేషన్‌లను మంగళవారం  కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పట్టాభిరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణహితంగా ఇంటింటి చెత్తసేకరణ చేపట్టడమే లక్ష్యంగా ఎలక్ట్రిక్ ఆటోలను తీసుకొచ్చామని, వాటి ఫలితంగా నగరాలు, పట్టణాల్లో ఇంటింటి చెత్తసేకరణ మెరుగుపడుతోందన్నారు. కర్నూలులో 5.6 శాతం మెరుగుదల నమోదవడం ఈ-ఆటోల పనితీరుకు నిదర్శనమన్నారు. 100 శాతం ఇంటింటి చెత్తసేకరణే లక్ష్యంగా నిర్ణీత మార్గాల్లో ఎలక్ట్రిక్ ఆటోలు తిరుగుతూ ప్రతిరోజూ ఇళ్ల వద్దకే చేరుకుని తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాయన్నారు. ప్రతి రోజూ నగరంలో 225 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, ఇవన్నీ డంప్‌యార్డుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, కమిషనర్ చల్లా ఓబులేసు ప్రత్యేక చొరవ తీసుకుని జీటీఎస్ స్టేషన్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కర్నూలు నగరానికి 91 ఆటోలు మంజూరు చేశామని, ఇప్పటికే 40 ఆటోలు వచ్చాయని, మిగిలినవి సైతం ఈ నెలాఖరులోగా వస్తాయన్నారు. నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ చేసేందుకు గార్గేయపురం డంప్‌యార్డులో 9.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, ఈ ప్లాంట్ ద్వారా ప్రతిరోజూ 200 మెట్రిక్ టన్నుల చెత్తను శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేసి పునర్వినియోగానికి అనువుగా మారుస్తామన్నారు. పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మరో ఏడాదిన్నరలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం పూర్తవుతుందని, ఇలా 100 శాతం ఇంటింటి చెత్తసేకరణ నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ వరకు రూ.కోట్ల రూపాయలు వెచ్చించి పూర్తిస్థాయి ప్రాజెక్టులను సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ



ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో తాము చేపట్టిన సర్వే వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబరు 325లో మొత్తం 388 ఎకరాలు ఉందని, తమ సర్వేలో అక్కడ 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలిందని చెప్పారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా అక్కడ ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని వివరించారు. దాంతో, ఆ 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని అధికారులను సీఎం ఆదేశించారు. భూమి గుర్తింపునకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదేశించారు.సర్వే నంబరు 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల భూములు ఉన్నందున.. భూముల రికార్డులు సమర్పించాలంటూ వారికి నోటీసులు జారీ చేస్తామని అధికారులు తెలిపారు. ఇక, సర్వే నంబరు 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం ఇక్కడ అమరవీరుల కాలనీని నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలనీలో అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, సకల సౌకర్యాలతో కాలనీని రూపుదిద్దాలని నిర్దేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ అధికారులు తీసుకోవాలని, జూన్ రెండో తేదీలోగా కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే, కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినియోగించే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం

గోరంట్ల/ శ్రీ సత్యసాయి, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అభివృద్ధిని అడ్డుకున్నా చూస్తూ ఊరుకోబోమని సరైన సమయంలో మీ సంగతి తేలుస్తామని' జగన్ కు, వైసీపీ నాయకులకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడు గుర్రాల్లా కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందన్నారు. అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి, సీఎం చంద్రబాబు పేదల కడుపు నింపుతున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో గతంలో పెనుకొండలో, ఇప్పుడు గోరంట్ల లో కేంద్రంలో తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కేంద్రంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుతో కలిసి మంత్రి సవిత అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానుద్దేశించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు, కార్మికులకు రూ.5లకే రుచికరమైన, నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించాలన్న లక్ష్యంతో 2018లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం న్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు పేదల కడుపు నింపితే, తరవాత వచ్చిన జగన్ వారి పొట్ట కొట్టారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు, ప్రభుత్వ పథకాలకు తన పేరు, శతన తండ్రి పేరు పెట్టుకున్న జగన్ అన్న క్యాంటీన్లకు కూడా తనకు నచ్చిన పేరు పెట్టుకొని నడిపించాల్సిందన్నారు.

# ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగరవనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయి. 305 హెక్టార్లలో, రూ.13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో, స్వచ్ఛమైన అందాలతో నగరవనాలు ఆరోగ్యం, ఆహ్లాదం, ప్రకృతి అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నాం. బాపట్ల, చీరాల తీర ప్రాంత పర్యాటక వనాలుగా ఉంటే, కోటప్పకొండ ఆధ్యాత్మిక సువాసనలతో విరాజిల్లుతుంది. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రకృతికి దగ్గరయితే, ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే, పరిరక్షణ బాధ్యత పెరుగుతుంది. ఇది ప్రకృతి నియమం.

సత్సంకల్పంతో ముందడుగు వేస్తున్నాం:

రాష్ట్రంలో ఎకో టూరిజం పెరగడం వల్ల గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళలను ప్రజలకు చేరువ చేస్తాం. గిరిజన సంస్కృతిని ప్రజలకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తాం. దీనివల్ల గిరిజనుల జీవన విధానంలో మంచి మార్పులు వస్తాయని సత్సంకల్పంతో పని చేస్తున్నాం. ప్రకృతిని ప్రేమించాలి, భావితరాలకు బహుమతిగా ఇవ్వాలనేది మా సంకల్పం. దీనికి కట్టుబడి పనిచేస్తాం. దీనికి ప్రజలు తమవంతుగా సహకరించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్ లోకేషన్ మాన్యువల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన్' విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్ ను డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగేంద్రబాబు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిష, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, అటవీ, పర్యావరణ శాఖ చీఫ్ సెక్రటరీ కాంతిలాల్ దండే, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఎకో టూరిజం ఈడీ నందిని సలారియా, అటవీశాఖ ఐటీ సలహాదారుల పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పగలు భగభగ.. రాత్రి గజగజ

హైదరాబాద్/విశాఖపట్నం, అక్టోబరు 6  రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటిపూట ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. అలాగే రాత్రి వేళ శీతాకాలం మాదిరిగా చలి పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. అక్టోబరు నెలలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు ఈ స్థాయిలో తగ్గలేదని నిపుణులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 15.3డిగ్రీలకు చేరింది. అలాగే రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 16.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్, కామారెడ్డి జిల్లా గాంధారిలలో 17.1, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 17.4 డిగ్రీలకు కనిష్ట ఉష్ణోగ్రతలు చేరాయి. ఇక హైదరాబాద్‌లోని మౌలాలి, శేరిలింగంపల్లిలో సైతం 17.1డిగ్రీలు రికార్డయ్యాయి. జనగాం జిల్లా మినహా మిగిలిన 32 జిల్లాల్లో ఎండ తీవ్రతకు సంబం?ధించి వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అన్ని జిల్లాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 35-37 డిగ్రీల మధ్య ఉన్నాయి. జగిత్యాల జిల్లా భీమారం, కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో అత్యధికంగా 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
వచ్చే మార్చి వరకూ కరువు ప్రభావం
తీవ్రమైన ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది దేశంలోని అనేక ప్రాంతాల్లో కరువు నెలకొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, బిహార్, పంజాబ్, రాజస్థాన్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాభావం కొనసాగింది. ప్రస్తుతం బలంగా ఉన్న ఎల్‌నినో రానున్న రెండు నెలల్లో మరింత తీవ్రంగా ఉంటుంది. ఆ తరువాత క్రమేపీ బలహీనపడనున్నది. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం వచ్చే ఏడాది మార్చి వరకు ఎల్‌నినో ప్రభావం కొనసాగనున్నది. ఎల్‌నినో సంవత్సరాల్లో కరువు పరిస్థితులు నెలకొంటాయని చరిత్ర చెబుతోంది. దేశంలో 1871 నుంచి 2026 వరకు... 155 ఏళ్లలో 27సార్లు అత్యంత తీవ్రమైన కరువు నెలకొందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ పేర్కొంది.

అదే 1950 తరువాత పదిహేనుసార్లు కరువు వచ్చింది. 1972, 2009 సంవత్సరాల్లో అత్యంత దారుణమైన కరువు పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. కాగా, ఎల్‌నినో ప్రభావంతో జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలలు వర్షాలు తగ్గడంతో వేడి వాతావరణం నెలకొంది. భారత వాతావరణ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం గతంతో ఎన్నడూ లేనంత ఎక్కువగా సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే సమయంలో గాలిలో తేమశాతం తగ్గడం మరింత ఆందోళన కలిగిస్తోందని వాతావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధుల భేటీపై ఈసీ కీలక ప్రకటన

ఢిల్లీ, అక్టోబరు 6 రాజకీయ పార్టీల ప్రతినిధుల భేటీపై కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు కీలక ప్రకటన చేశారు. ఈరోజు (మంగళవారం) సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ తమతో భేటీ కోసం సమయం కోరలేదని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎంపీల ప్రతినిధి బృందం తమను కలవాలనుకుంటున్నట్లు 4 గంటల తర్వాత ఢిల్లీ పోలీసుల ద్వారా తమకు సమాచారం అందిందని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో భేటీలకు 2025లోనే ఈసీ ప్రత్యేక విధానం రూపొందించిందని చెప్పుకొచ్చారు. ఈసీని కలవాలంటే అధికారిక ప్రతినిధి ద్వారా ముందుగా సమయం కోరాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. రెండు పక్షాల పరస్పర అంగీకారంతో భేటీ సమయం ఖరారవుతుందని చెప్పారు. 240 మంది ఎంపీలతో సమావేశం కావాలని ప్రతిపాదన వచ్చినట్లు ఢిల్లీ పోలీసుల సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు.

# 66 చదరపు గజాలు..

# 5 అంతస్తుల భవనం!

- కేపీహెచ్‌బీ కాలనీలో నిర్మాణ నిబంధనలకు తూట్లు?
- ప్లాట్ నంబర్ EWS 862పై చర్యలు ఎప్పుడు?
- గతంలోని జుబౌ-940 నిర్మాణంపైనా విచారణ చేయాలని డిమాండ్
- అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి

**అభ్యుదయం -- కూకట్‌పల్లి (అక్టోబర్ 06):**

కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలోని ప్లాట్ నంబర్ 862లో సుమారు 66 చదరపు గజాల స్థలంలో ఐదు అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత చిన్న విస్తీర్ణంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి ఏ మేరకు అనుమతులు ఉన్నాయి? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరుగుతోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నిర్మాణంపై ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉన్నప్పటికీ అధికారులు ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్థలాన్ని పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరుతున్నారు.

### 66 గజాల్లో ఐదు అంతస్తులా?

చిన్న స్థలాల్లో భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడితే సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, రాకపోకలు, ఫైర్ సేఫ్టీ, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక అంశాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

అందువల్ల ప్లాట్ నంబర్ 862కు మంజూరైన భవన అనుమతి ఏమిటి? అనుమతించిన అంతస్తుల సంఖ్య ఎంత? ప్రస్తుతం వాస్తవంగా ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు? అనుమతించిన విస్తీర్ణం కంటే అదనంగా నిర్మాణం జరుగుతోందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### గతంలోని జుబౌ-940 నిర్మాణం, వాటిని సహకరించిన అధికారుల పైనా చర్యలు కావాలి

స్థానికుల ఆరోపణల ప్రకారం, ప్లాట్ నంబర్ 940 జుబౌలో గతంలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల నిర్మాణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లోనే అధికారులు నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకోలేదు? అనుమతులు ఏ మేరకు ఉన్నాయి? అనుమతులకు మించి నిర్మాణం జరిగితే దానిపై ఏ చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

ప్లాట్ నంబర్ 940 జుబౌ నిర్మాణానికి సంబంధించిన పాత అనుమతులు, ప్లాన్, నిర్మాణ స్థితి, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్, నీరు--డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఒక్కసారి కాదు.. మళ్లీ అదే విధానమా?

ప్లాట్ నంబర్ 940లో గతంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే, అదే నిర్మాణదారులు లేదా సంబంధిత వ్యక్తులు ఇప్పుడు ప్లాట్ నంబర్ 862లోనూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాన్ని పునరావృతం చేస్తున్నారా? అనే అంశాన్ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారిక విచారణలో తేలిన పక్షంలో కేవలం నిర్మాణాన్ని సీజ్ చేయడం లేదా నోటీసులతో సరిపెట్టకుండా, వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### "ఒకసారి తప్పించుకున్నారు.. మళ్లీ అదేనా?"

"గతంలో ఒక నిర్మాణంపై చర్యలు లేకపోవడం వల్లే ఇప్పుడు మరింత ధైర్యంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న నిర్మాణదారులతో పాటు, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణం తెలిసినా నిర్లక్ష్యం చేసిన అధికారులు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

### నీరు, డ్రైనేజీపై తీవ్ర ప్రభావం

ఇలాంటి చిన్న స్థలాల్లో అనేక కుటుంబాలు నివసించేలా భారీ నిర్మాణాలు పెరిగితే స్థానిక నీటి పైపులైన్‌పై అదనపు భారం పడే అవకాశం ఉంది. తాగునీటి సరఫరాలో ఒత్తిడి తగ్గడం, నీటి కొరత ఏర్పడటం వంటి సమస్యలు తలెత్తవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదేవిధంగా అధిక సంఖ్యలో నివాసితుల నుంచి వెలువడే మురుగునీటిని ప్రస్తుత డ్రైనేజీ వ్యవస్థ తట్టుకోగలదా? అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీ సామర్థ్యం సరిపోకపోతే రోడ్లపై మురుగునీరు నిలిచిపోవడం, పైపులు పొంగిపొర్లడం, దుర్వాసన, దోమల సమస్యలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

### విద్యుత్, నీటి కనెక్షన్లు ఎలా?

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు తేలితే, అలాంటి నిర్మాణాలకు నీటి కనెక్షన్, మురుగునీటి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ వంటి సదుపాయాలు ఏ విధంగా మంజూరయ్యాయి? సంబంధిత విభాగాలు భవన అనుమతులను ధృవీకరించాయా? అనే అంశాలపై కూడా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను గుర్తించడం కేవలం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ శాఖ బాధ్యతగా కాకుండా, తమ పరిధిలోని అనుమతులు, కనెక్షన్ల విషయంలో సంబంధిత శాఖలు కూడా నిబంధనలను పాటించాయా లేదా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

### సన్నని వీధులు.. అత్యవసర వాహనాలకు ఇబ్బందులు

కేపీహెచ్‌బీ కాలనీలోని అనేక వీధులు ఇరుకుగా ఉండటంతో పాటు రోడ్లపై ద్విచక్ర వాహనాల పార్కింగ్, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు తదితర కారణాలతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఇలాంటి ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు పెరిగితే భవిష్యత్‌లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్లు, మున్సిపల్ చెత్త వాహనాలు రాకపోకలు సాగించడంలో మరింత ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



66 గజాల్లో నిర్మాణం అవుతుతున్న బహుళ అంతస్థుల భవనం 862 EWS.



గతంలో 66 గజాల్లో నిర్మించిన భవనం EWS 940 (ఫైల్ ఫోటో)

### సీజ్ కాదు.. అక్రమ భాగాల తొలగింపు కావాలి

ప్లాట్ నంబర్ 862లో నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారిక తనిఖీలో తేలితే, కేవలం సీజ్ చేయడం లేదా నోటీసులు ఇవ్వడంతో సమస్య పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భాగాలను చట్టప్రకారం తొలగించడం/కూల్చివేయడం, బాధ్యులపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అదే విధంగా ప్లాట్ నంబర్ 940 జుబౌలో గత నిర్మాణంపైనా ప్రత్యేక విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత నిర్మాణదారులు, బాధ్యులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపైనా విచారణ జరపాలి

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే, నిర్మాణదారుల చర్యలతో పాటు నిర్మాణాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం చేశారా? ఎవరి అనుమతులు లేదా నిర్లక్ష్యం వల్ల నిర్మాణం ముందుకు సాగింది? అనే అంశాలపైనా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తూ పదేపదే నిర్మాణాలు చేపడుతున్నట్లు విచారణలో తేలితే, సంబంధిత వ్యక్తులపై వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజల భద్రతే ముందుగా..

భవన అనుమతులు, నిర్మాణ నిబంధనలు కేవలం కాగితాలపై ఉండేందుకు కాదని, ప్రజల భద్రత, మౌలిక సదుపాయాలు, రాకపోకలు, పర్యావరణ పరిరక్షణ కోసం రూపొందించబడినవని స్థానికులు గుర్తుచేస్తున్నారు.

ప్లాట్ నంబర్ 862తో పాటు ప్లాట్ నంబర్ 940 జుబౌపై సమగ్ర విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిర్మాణదారులపై, బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను చట్టప్రకారం తొలగించాలని కేపీహెచ్‌బీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణంపై కదిలిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

## కూల్చివేత పనులు మొదలైనా.. చర్యలు 'సోసో'గానే! ప్లాట్ నం.183పై మాత్రం ఎందుకీ మినహాయింపు?

అభ్యుదయం -- కూకట్‌పల్లి, (అక్టోబర్ 6): అల్విన్ కాలనీ సర్కిల్--51 పరిధిలోని గూర్రం జాషువా వీధి, భాగ్యనగర్ కాలనీ ఫేజ్--3లో ఎంఎన్ఆర్ స్కూల్ ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణంపై 'అభ్యుదయం'లో ప్రచురితమైన కథనానికి స్పందన కనిపించింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) అధికారులు నిర్మాణంపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

అయితే అధికారులు చేపట్టిన కూల్చివేత పనులు పూర్తిస్థాయిలో లేకపోవడం, కేవలం నామమాత్రంగా కొనసాగుతున్నాయనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్లాట్ నంబర్ 183లో అనుమతి లేకుండానే నిర్మాణం జరిగిందని ఆరోపణలు ఉన్నప్పటికీ, ఆ నిర్మాణాన్ని పూర్తిగా సీజ్ చేసి కూల్చివేత ఎందుకు చేపట్టలేదనే ప్రశ్నలు ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తున్నాయి.

### కూల్చివేత ఇలా ఎందుకు?

అనుమతులకు మించి నిర్మాణం జరిగిందని గుర్తించిన అధికారులు కూల్చివేతకు చర్యలు ప్రారంభించడం స్వాగతించదగ్గ పరిణామమే. అయితే కూల్చివేత పనులు పూర్తిస్థాయిలో జరగకుండా, కేవలం కొంత భాగానికే పరిమితం కావడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు."నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణమైతే.. ఎవరి భవనం అయినా ఒకే విధమైన నిబంధనలు వర్తించాలి. కూల్చివేత కూడా పూర్తి స్థాయిలో జరగాలి. సగం సగం చర్యలతో సమస్య పరిష్కారం కాదు" అని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### జీరో పర్మిషన్ భవనానికి ఎందుకీ మినహాయింపు?

ఈ వ్యవహారంలో ప్రధానంగా చర్చకు వస్తున్న అంశం ప్లాట్ నంబర్ 183.స్థానికుల ఆరోపణల ప్రకారం ఈ భవనానికి అనుమతి లేదని చెబుతున్నారు. అలాంటప్పుడు సంబంధిత రికార్డులను పరిశీలించి, నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేకపోతే నిబంధనల ప్రకారం సీజ్ చేయడంతో పాటు పూర్తిస్థాయి కూల్చివేత ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
అధికారులు మాత్రం ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, రికార్డులు, ఉల్లంఘనల స్థాయిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నట్లు సమాచారం.

### ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఎప్పుడు?

ఈ వ్యవహారంలో జవీజ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అంశాలు ఇంకా ఉన్నాయి.
ప్లాట్ నంబర్ 183కు భవన నిర్మాణ అనుమతి ఉందా?
అనుమతి లేకపోతే ఇప్పటివరకు ఎందుకు పూర్తిస్థాయి కూల్చివేత జరగలేదు?
అధికారులు చేపట్టిన కూల్చివేతలో ఏ భాగాలను తొలగించారు?
మిగిలిన నిర్మాణంపై తదుపరి చర్యలు ఏమిటి?
ఇతర ప్లాట్లలో జరిగిన ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలు ఏమిటి?
నిర్మాణానికి విద్యుత్, నీటి కనెక్షన్లు ఎలా మంజూరయ్యాయి?
హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమీపంలో నిర్మాణానికి సంబంధించి భద్రతా తనిఖీలు జరిగాయా?



జీరో పర్మిషన్ ఉన్న భవనానికి కేవలం పెంట్ హౌస్ సీలింగ్ పై మాత్రమే చర్యలు



తూ తూ మంత్రంగా గోడలను కొట్టి వదిలేసినా జీరో పర్మిషన్ ఉన్న భవనం చిత్రం

### "అభ్యుదయం కథనం తర్వాతైనా చర్యలు రావడం మంచిదే" -- స్థానికులు

"ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదనే భావన ఉండేది. అభ్యుదయంలో వార్త వచ్చిన తర్వాత అధికారులు స్పందించడం సంతోషకరం. కానీ చర్యలు సగంలో ఆగిపోకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు కోరుతున్నారు.
మరో స్థానికుడు మాట్లాడుతూ.. "అనుమతి ఉన్న భవనంలో చిన్న ఉల్లంఘన జరిగినా చర్యలు తీసుకుంటే, అనుమతి లేని నిర్మాణంపై మరింత కఠినంగా వ్యవహరించాలి. ఎవరికి మినహాయింపులు ఇవ్వకూడదు" అని అన్నారు.
"కూల్చివేత పేరుతో కొంత భాగం మాత్రమే తొలగిస్తే ప్రజలకు ఏం సందేశం వెళ్తుంది? చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. నిర్మాణం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి" అని మరొకరు అభిప్రాయపడ్డారు.

### అధికారుల స్పందనకు అభ్యుదయం ప్రశ్న

'అభ్యుదయం ఎఫెక్ట్'తో చర్యలు మొదలైనప్పటికీ.. చర్యలు పూర్తి స్థాయిలో లేకపోతే ప్రయోజనం ఏమిటి?

ప్రజల ఆరోపణలు, నిర్మాణ అనుమతులు, ప్లాట్ నంబర్లు, కూల్చివేతకు సంబంధించిన అధికారిక రికార్డులను జవీజ అధికారులు బహిర్గతం చేస్తే మరింత పారదర్శకత ఏర్పడుతుంది.ప్లాట్ నంబర్ 183కు నిజంగా ఎలాంటి అనుమతి లేకపోతే.. ఆ నిర్మాణంపై సీజ్, కూల్చివేత చర్యలు ఎందుకు పూర్తిస్థాయిలో జరగడం లేదు? అన్న ప్రశ్నకు అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.అక్రమ నిర్మాణంపై చర్యలు ప్రారంభించడం మొదటి అడుగు మాత్రమే.. చివరి వరకు నిబంధనల ప్రకారం చర్యలు పూర్తి చేయడమే అసలు 'అభ్యుదయం ఎఫెక్ట్'.

**అభ్యుదయం ఎఫెక్ట్**



**అనుమతులు కొద్దే.. అంతస్తులు ఎన్నో!**

● అధికారుల కళ్ల ముందే అక్రమ నిర్మాణమా?

● సర్కిల్--51 అల్విన్ కాలనీలో నిర్మాణంపై అనేక ప్రశ్నలు.. విద్యుత్, నీటి కనెక్షన్లపైనా సందేహాలు.

# యూపీఐ చెల్లింపుల వెనుక ఖర్చెవరిది?

భారతదేశంలోని డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌స్పేస్ (యూపీఐ) ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఒక క్యూఆర్ కోడ్‌తో క్షణాల్లో డబ్బు చెల్లించవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము లేకపోవడం యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే అధిక విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయం యూపీఐ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నది.

2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనున్నది. ఇకపై యూపీఐ వాడిన ప్రతిసారీ వినియోగదారుడు రుసుము చెల్లించాల్సి వస్తుందని కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే ఉంటాయి. అలాగే రూ.2,000 వరకు చేసే వ్యాపార చెల్లింపులపైనా ఈ రుసుము ఉండదు. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా కొన్ని రక్షణలు కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీలు ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఎండీఆర్ అనేది వినియోగదారుడిపై నేరుగా విధించే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు రూ.10,000కు సంబంధించిన లావాదేవీపై 0.4 శాతం రుసుము అంటే రూ.40 అవుతుంది. కొన్ని లావాదేవీలకు గరిష్ఠ పరిమితులు, కొన్ని ముఖ్యమైన రంగాలకు ప్రత్యేక రేట్లు కూడా ఉన్నాయి.

ఈ మార్పు వెనుక ఆర్థిక కారణం కూడా ఉన్నది. యూపీఐ వినియోగదారుడికి ఉచితంగా కనిపించినప్పటికీ, దాన్ని నిర్వహించడం మాత్రం ఉచితం కాదు. బ్యాంకులు, చెల్లింపు సంస్థలు సర్వర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సమాచార వ్యవస్థల నిర్వహణ, వినియోగదారుల సేవల కోసం నిరంతరం ఖర్చు చేయాలి. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా సుమారు రూ.2,400 కోట్ల లావాదేవీలు జరిగాయి. వాటి మొత్తం విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లు. ఇప్పటివరకు జీరో ఎండీఆర్ విధానాన్ని ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాల ద్వారా కొనసాగించింది. దీని వల్ల చిన్న దుకాణదారుడు కూడా ఎలాంటి లావాదేవీ రుసుము గురించి ఆలోచించకుండా యూపీఐ చెల్లింపులను స్వీకరించగలిగాడు. అయితే యూపీఐ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవస్థ నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాలా? కొత్త మార్గాలను అన్వేషించడం అవసరమా అనే చర్చ జరుగుతున్నది.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇండియన్ రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం

**సమాజ సేవలో మరింత చురుగ్గా పనిచేయాలి: కలెక్టర్ రాజర్షి షా**





ఆదిలాబాద్ లోకల్ టైమ్స్ న్యూస్ ప్రతినిధి
ఆదిలాబాద్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గ సభ్యులు, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టనున్న వివిధ సేవా కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అత్యవసర సమయాల్లో బాధితులకు సహాయ చర్యలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా, సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.నూతన కార్యవర్గ సభ్యులను కలెక్టర్ అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించి పేదలు, నిరుపేదలు, బాధితులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని సూచించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. సమాజ హితం కోసం నూతన కార్యవర్గం అంకితభావంతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు ఆడే క్రాంతి కుమార్, మనోహర్, సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# "ఆర్టీసీ బస్సు ఢీ ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురికి గాయాలు



అల్లదుర్గ్ లోకల్ టైమ్స్ న్యూస్ ప్రతినిధి: అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామ శివారులో సర్వీస్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ గుంతలో బోల్తా పడింది.

అల్లాదుర్గం : అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామ శివారులో సర్వీస్ రోడ్డుపై ఘోర ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఎస్ఐ అమృత్ వివరాల ప్రకారం...టేక్మాల్ కు చెందిన కిరణ్ తన తోటి కూలీలు మాల మొగులయ్య, మాల లక్ష్మి, మాల నాగమణిలతో కలిసి ట్రాక్టర్ లో ఇటుక లోడ్ తో టేక్మాల్ తండా నుంచి శంకరంపేట వైపు వెళ్తున్నారు. చిల్వర్ శివారులోకి రాగానే వెనక నుండి అతి వేగంగా వస్తున్న నారాయణఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త నడుపుతూ.. ఓవర్ టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న మాల మొగులయ్య ఎడమ కాలుకు, నాగమణికి ఎడమ చేతికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. కిరణ్, లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో అల్లాదుర్గం ఏఎస్సై అమృత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసు పోస్టుల్లో నాలుగు జిల్లాలకు అన్యాయం

ఎల్బీనగర్, అక్టోబర్ 6 : పోలీసు కానిస్టేబుల్ నియామక నోటిపికేషన్‌లో మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాలకు పోస్టులు కేటాయిచకపోవడంపై నిరుద్యోగ అభ్యర్థులు భగ్గుమన్నారు. దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగ అభ్యర్థులు మంగళవారం చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌండ్ల నాగేందర్‌గౌడ్ మద్దతు ప్రకటించారు.ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ జైళ్లు, అగ్నిమాపక శాఖల్లోమొత్తం 7,437 పోస్టుల భర్తికి నోటిఫికేషన్ విడుదల చేశారు. మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఖాళీలు ప్రకటించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయా జిల్లాల అభ్యర్థులకు న్యాయం చేయాలని




# టాస్ గెలిచిన భారత్..

## టీ20ల్లో ఐపీఎల్ స్టార్ అరంగేట్రం..!

వన్డే సిరీస్‌ను 2-1తో గెలుపొందిన భారత జట్టు.. టీ20 సవాల్‌కు సిద్ధమైంది. ఆసియా క్రీడల్లో వరసగా రెండో స్వర్ణం గెలుపొందిన టీమిండియా అదిరే బోణీతో సిరీస్ ఆరంభించాలనుకుంటోంది. లక్నోలోని ఏకనా స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన అయ్యర్ బౌలింగ్ తీసుకున్నాడు. ఊహించినట్టే వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. హిట్టర్లతో నిండిన, ఐపీఎల్ అనుభవం కలిగిన ఆటగాళ్లు విండీస్ జట్టులో ఉన్నారు. దాంతో.. బోణీ ఎవరిది? అనేది ఆసక్తి రేపుతోంది.

ఆసియా క్రీడల్లో స్వర్ణంతో జోష్ మీదున్న శ్రేయాస్ అయ్యర్ సేన జింబాబ్వే, అఫ్గనిస్థాన్‌పై విజయాలను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. టాస్ గెలిచిన అయ్యర్ ఛేదనకు మొగ్గు చూపాడు. టాస్‌కు ముందు పేసర్ అర్ష్‌దీప్ సింగ్ చేతులు మీదుగా ఐపీఎల్ స్టార్ నమన్ ధిర్ డెబ్యూ క్యాప్ అందుకున్నాడు. తుది జట్టు విషయానికొస్తే.. వైభవ్ సూర్యవంశీ బెంచ్‌మీదే ఉండనున్నాడు. అతడితో పాటు రవి బిష్ణోయ్, నితీశ్ రెడ్డి, ప్రిన్స్ యాదవ్‌లను పక్కన పెట్టేశామని అయ్యర్ తెలిపాడు.

భారత తుది జట్టు: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, శివం దూబే, నమన్ ధిర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్.

# అగార్కర్ వారసుడిగా అతడే సమర్థుడు..

## మాజీ స్పిన్నర్‌కే చీఫ్ సెలెక్టర్ పగ్గాలు..!

భారత పురుషుల సీనియర్ జట్టు ఛీఫ్ సెలెక్టర్ రేసు ఆసక్తి రేపుతోంది. ఈమధ్యే అజిత్ అగార్కర్ (ూాయిత్-ూాస్ఖుతీఝితీ) పదవీకాలం ముగియడంతో అతడి స్థానంలో ఎవరు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే.. ఈ ప్రశ్నకు సమాధానం దాదాపు దొరికేసింది అనిపిస్తోంది. పలువురు మాజీ ఆటగాళ్లు పోటీలో ఉన్నప్పటికీ మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝా (ూతీఖుస్త్రఖుఅ ూాయిష్ఖు) అందరికంటే ముందున్నాడు. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీలో సభ్యుడైన ఓఝా తాత్కాలికంగా చీఫ్ సెలెక్టర్ బాధ్యతలు చేపట్టినా.. అతడు పూర్తి స్థాయిలో సేవలందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే.. అగార్కర్ వారసుడిగా అతడు సరైన, సమర్థుడైన వ్యక్తి అని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి. స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే, టీ20లకు స్క్వాడ్ ప్రకటన అనంతరం.. అజిత్ అగార్కర్ స్థానంలో కొత్త చీఫ్ సెలెక్టర్‌పై స్పష్టత వస్తుందని అంతా ఊహించారు. ముంబైలో జరిగిన 95వ బోర్డు వార్షిక సమావేశంలో అగార్కర్ గురించి ఓ నిర్ణయానికి రావాలని సభ్యులకు బీసీసీఐ సూచించింది కూడా. తన కాంట్రాక్ట్‌ను పొడిగించాలని అతడు సైతం బీసీసీఐని కోరలేదు. దాంతో.. తదుపరి చీఫ్ సెలెక్టర్ రేసులో మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓఝాలు ఉన్నారనే వార్తలు వినిపించాయి.







అయితే.. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీలో సభ్యుడైన ఓఝాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించింది బీసీసీఐ. కొత్త చీఫ్ సెలెక్టర్ ఎంపిక పూర్తయ్యేంత వరకూ అతడు కొనసాగుతాడని భారత బోర్డు పేర్కొంది. కానీ, ఓఝా పూర్తి స్థాయిలో చీఫ్ సెలెక్టర్ పదవి చేపట్టే అవకాశాలున్నాయి. 'బీసీసీఐలో ఏదైనా జరగొచ్చు. చూస్తుంటే ఓఝాకు అందరూ అమోదం చెబుతారని అనిపిస్తోంది' అని మంగళవారం బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

### టెస్టుల అనుభవంతో

చీఫ్ సెలెక్టర్ రేసులో ఓఝా అందరికంటే ముందుండడానికి ఓ కారణముంది. ప్రస్తుత సెలక్షన్ సభ్యుల్లోని అందరికంటే అతడు ఎక్కువ (24) టెస్టులు ఆడాడు. శివ సుందర్ దాస్ 23, ఆర్పీ సింగ్ 14, అజయ్ రత్రా ఆరు టెస్టులు మాత్రమే ఆడారు. మాజీ వికెట్ కీపర్ పార్థివ్ పటేల్ పేరు వినిపించినా ఓఝాకే ఎక్కువ మద్దతు లభించేలా ఉంది. అలాఅనీ.. అతడి పేరును బీసీసీఐ ఇంకా ఖరారు చేయలేదు. అక్టోబర్ రెండో వారంలో.. న్యూజిలాండ్‌తో వన్డే, టీ20లకు స్క్వాడ్ ప్రకటనలోపు లేదంటే తర్వాతైన అజిత్ అగార్కర్ వారసుడు ఎవరు? అనేది తేలిపోనుంది. సెప్టెంబర్ 26న మధ్యంతర చీఫ్ సెలెక్టర్‌గా ఓఝా నియమితుడైన విషయం తెలిసిందే.

# హర్మన్‌ప్రీత్ అధ్యాయం ముగిసె.. మంధానకు కెప్టెన్సీ లాంఛనమే..!

భారత మహిళల క్రికెట్‌లో ఓ అధ్యాయం ముగిసింది. టీమిండియా చిరకాల కలను సాకారం చేస్తూ వన్డే వరల్డ్‌కప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ (ఝతీఝఅజూతీవవ్ ఖుబతీ) సారథిగా వైదొలిగింది. ఆసియా క్రీడల్లో వరసగా రెండో స్వర్ణం గెలిచిన అనంతరం కెప్టెన్సీ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగింది. పద్నాలుగేళ్లుగా నాయకిగా చెరగని ముద్ర వేసిన హర్మన్‌ప్రీత్ ఇకపై ప్లేయర్‌గానే కొనసాగనుండగా.. తదుపరి స్మృతి మంధాన(ూఎతీఁఱ వీఖఅస్ఖుఖు)కు బాధ్యతలు అప్పగించడం లాంఛనమే అనిపిస్తోంది. ఇప్పటికే వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న మంధానను త్వరలోనే పూర్తి స్థాయి కెప్టెన్‌గా బీసీసీఐ ప్రకటించనుందని సమాచారం. దిగ్గజ క్రికెటర్లకు సాధ్యమవ్వని ఘనతలు, ఐసీసీ వన్డేవరల్డ్‌కప్ ట్రోఫీని కట్టబెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీకి బైబై చెప్పేసింది. 2012లో టీ20లు, 2016లో వన్డేలో.. 2022లో టెస్టులు.. ఇలా మూడు ఫార్మాట్లకు నాయకత్వం వహించిన తను.. పద్నాలుగేళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించింది. దూకుడైన ఆటతో, గెలుపే మంత్రగా చెలరేగిన హర్మన్‌ప్రీత్.. టీమిండియాను ఉన్నత శిఖరాలకు చేర్చింది. కోచ్ అన్మోల్ మజుందార్ సూచనలు, పటిష్టమైన స్క్వాడ్‌తో అద్భుతాలు చేసిన హర్మన్.. ఆసియా క్రీడల్లో







స్వర్ణంతో మురిసింది.ఐచీ నగోయ నుంచి తిరిగి వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ మంగళవారం నా జాబ్ ముగిసింది అంటూ కెప్టెన్సీ వదులుకుంది. తను ఈ నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను గమనిస్తే.. వయసు 37కు చేరడం.. స్మృతి మంధానకు కెప్టెన్సీ ఇవ్వాలని మాజీల డిమాండ్లు రావడం, తాను సారథ్యానికి సిద్ధమేనని మంధాన ప్రకటించడం వంటివి ఆమెను ప్రభావితం చేసి ఉంటాయి.అందుకే కాబోలు.. మరో సిరీస్ కోసం వేచి చూడకుండా ఆసియా కప్, ఆసియా క్రీడల ఛాంపియన్‌గా సగర్వంగా నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలిగింది హర్మన్. దాంతో.. ప్రస్తుతం వైస్ కెప్టెన్‌గా ఉన్న ఓపెనర్ స్మృతి మంధాన కెప్టెన్సీ కల నిజమవ్వనుంది. స్వదేశంలో జింబాబ్వేతో టీ20, వన్డే సిరీస్‌లో భారత జట్టు తలపడనుంది. అక్టోబర్ 16 నుంచి మొదలయ్యే ఈ సిరీస్ కోసం త్వరలోనే సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించనున్నారు. ఈ సమయంలోనే కెప్టెన్‌గా మంధాన పేరును ఖరారు చేసే అవకాశముంది.

### మంధాన ఎందుకంటే..

హర్మన్‌ప్రీత్ వారసురాలిగా స్మృతి మంధానకే ఎక్కువ అవకాశాలున్నాయి. జట్టులో దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ వంటి సీనియర్లున్నా.. వైస్ కెప్టెన్‌గా ఉన్న మంధాన వీరి కంటే రేసులో ముందుంది. ఓపెనర్‌గా విధ్వంసక ఆటతో అలరించే తనకు హర్మన్ గైర్హాజరీలో సారథ్యం వహించిన అనుభవముంది.

# మహిళా క్రికెట్‌లో మంధాన శకం..

: భారత మహిళల క్రికెట్‌లో నవశకం మొదలైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో ఆమె స్థానంలో ఓపెనర్ స్మృతి మంధాన నాయకిగా ఎంపికైంది. స్వదేశంలో జింబాబ్వేతో వైట్‌బాల్ సిరీస్‌కు మంధానను సారథిగా ఎంపిక చేశారు సెలెక్టర్లు. వన్డేలతో పాటు టీ20లకు కెప్టెన్‌గా ఆమెను ప్రకటిస్తూ పటిష్టమైన స్క్వాడ్‌ను వెల్లడించారు. దాంతో.. ఈ సిరీస్ ముందు వరకూ వైస్ కెప్టెన్‌గా కొనసాగిన మంధాన ఇకపై పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది.

మహిళా క్రికెట్‌లో స్మృతి మంధాన శకం షురూ అయింది. వెటరన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వారసురాలిగా స్మృతి మంధాన కెప్టెన్సీ చేపట్టింది. ఆసియా క్రీడల్లో వరసగా రెండో స్వర్ణం అందించిన హర్మన్.. స్వచ్ఛందంగా నాయకి పాత్రను వదులుకోగా ఆమె స్థానంలో మంధాన ఎంపికైంది.

మంగళవారం జింబాబ్వే సిరీస్‌కు స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఈ ఓపెనర్‌ను సారథిగా అనౌన్స్ చేశారు. సీనియర్ దీప్తి శర్మకు వన్డే వైస్ కెప్టెన్‌గా.. ఓపెనర్ షఫాలీ




వర్మకు టీ20 వైస్ కెప్టెన్‌గా అవకాశమిచ్చారు. ఇకపై ప్లేయర్‌గానే కొనసాగనున్న హర్మన్‌ప్రీత్ వన్డే, టీ20 స్క్వాడ్లలోనూ చోటు దక్కించుకుంది. అక్టోబర్ 16 నుంచి భారత్, జింబాబ్వే మధ్య పొట్టి సిరీస్ జరుగనుంది.

భారత వన్డే స్క్వాడ్: స్మృతి మంధాన(కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, హర్లీన్ డియోల్, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ(వైస్ కెప్టెన్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), రీచా ఘోష్(వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, రేణుకా ఠాకూర్.

భారత టీ20 స్క్వాడ్: స్మృతి మంధాన(కెప్టెన్), షఫాలీ వర్మ(వైస్ కెప్టెన్), నికీ ప్రసాద్, హర్మన్‌ప్రీత్ కౌర్, అనుష్క శర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), దీప్తి శర్మ, ప్రేమా రావత్, నందిని శర్మ, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, మిన్ను మణి, జింతిమణి కలిత.

# టీ20ల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన అయ్యర్..

## అదిరిన టీమిండియా బోణీ..!

భారత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(102 నాటౌట్) తొలి టీ20 శతకంతో రెచ్చిపోయాడు. వెస్టిండీస్ బౌలర్లను ఊచకోత కోసిన అయ్యర్.. విధ్వంసక ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డాడు. 171 పరుగుల ఛేదనలో పవర్ ప్లేలోనే అభిషేక్ శర్మ(21), సంజూ శాంసన్(11)లు ఔటైనా.. ఇషాన్ కిషన్(37 నాటౌట్) అండతో చెలరేగాడు అయ్యర్. అర్ధ శతకం తర్వాత మరింత ఉతికేసిన అతడు 42 బంతుల్లో వంద కొట్టేశాడు. దాంతో.. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా సిరీస్‌లో ముందంజ వేసింది.

లక్నోలోని ఎకానా స్టేడియంలో శ్రేయాస్ అయ్యర్(102 నాటౌట్) శివమెత్తాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్‌పై చెలరేగిన అయ్యర్.. ఈసారి వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టాడు. తొలి టీ20లో విండీస్ నిర్దేశించిన 171 పరుగుల ఛేదనలో శుభారంభం దక్కకున్నా నేనున్నాగా అంటూ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రెచ్చిపోయాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ అభిషేక్ శర్మ(21)ను రోస్టన్ ఛేజ్ ఔట్ చేయగా.. అకీల్ హొసేన్ ఓవర్లో సంజూ శాంసన్(11) అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. పవర్ ప్లేలో.. రెండు కీలక వికెట్లు




పడిన వేళ ఇషాన్ కిషన్(37 నాటౌట్), కెప్టెన్ అయ్యర్‌లు నిలబడ్డారు.

# ఎస్ఐఆర్‌పై సమరశంఖం

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఇండియా కూటమి



బడంగ్ పేట్ ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్ష వైఖరికి నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ నిరసన మార్చ్, ధర్నా నిర్వహించారు. ఇండియా కూటమి, ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని, మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ఇండియా కూటమి పక్షాలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని, ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అనుసరిస్తున్నారని వారు ఆరోపించిన ఏకపక్ష విధానాలను ఖండిస్తూ ఇండియా కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి కూటమి శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఎం కార్యదర్శి బోడ సామేలు, చేవెళ్ల ఇంచార్జి భీమ్ భరత్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం గడప తొక్కిన వైకాపా

స్థానిక ఎన్నికలపై సవాల్



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల పోరు రసవత్తర మలుపు తిరిగింది. ఎన్నికల నగారా మోగకముందే న్యాయపోరాటం పారకాష్టకు చేరింది. రాష్ట్ర హైకోర్టు ఎన్నికల నిర్వహణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అధికార పక్షం హర్షం వ్యక్తం చేస్తుండగా, ప్రతిపక్ష వైఎస్సార్సీపీ మాత్రం ఏకంగా దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సంకల్పంలో నిబంధనలు గాలికొదిలేశారా? వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితా వ్యవహారంలో ఆంతర్యమేమిటి? ఈ ప్రశ్నలకు సుప్రీంకోర్టు విచారణే సమాధానం చెప్పాల్సి ఉంది.హైకోర్టు తీర్పుపై అభ్యంతరం: మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా అక్టోబర్ 1న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి విదితమే. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైఎస్సార్సీపీ తరపున ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (రాజుజ)ను ప్రధాన ప్రతివాదిగా చేర్చారు. సమగ్ర సమాచార సేకరణ (రా×=) ప్రక్రియ ముగిసిన పిమ్మటే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

సుప్రీంలో వాదనలు -- ధర్మాసనం స్పందన: షెడ్యూల్ ఏ క్షణమైనా వెలువడే ఆస్కారమున్నందున ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని వైఎస్సార్సీపీ న్యాయవాది భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. ఇదే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌తో కలిపి శుక్రవారం విచారించే అవకాశాన్ని పరిశీలిస్తామని (చూద్దామని) సీజేఐ స్పష్టం చేశారు. సరిహద్దులు, వార్డుల పరిధులు 'ఫ్రీజ్' కావని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. స్థానిక సమరంపై సుప్రీం ఇచ్చే తీర్పు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని ఎలా మార్చనుందో వేచిచూడాలి.

# చర్ల రోడ్లకు మోక్షమెప్పుడు...సెంటర్ లైటింగ్, రింగ్‌రోడ్డుపై ఏళ్లుగా హామీలే

చర్ల, చర్ల మండలంలో రహదారుల అభివృద్ధిపై ఏళ్లుగా వినిపిస్తున్న హామీలు కార్యరూపం దాల్చకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. భద్రాచలం--చర్ల మార్గం ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వరకు కీలకమైన రహదారి కావడంతో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. మరోవైపు చర్ల పట్టణంలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతున్నా.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.

విస్తరించిన రోడ్డు.. నెరవేరని హామీ

చర్ల బస్టాండ్ రోడ్డు గాంధీబొమ్మ సెంటర్,నుంచి ఆయిల్‌బంక్ ఏరియా ప్రాంతం వరకు గతంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రహదారి వెడల్పు పెరగడంతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గుతుందని ప్రజలు భావించారు. అయితే సెంటర్ లైటింగ్‌తో కూడిన విస్తృత రహదారి ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందనే ప్రశ్న ఇప్పుడు స్థానికుల నుంచి వినిపిస్తోంది.బస్టాండ్ ప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, బస్సులు, భారీ వాహనాలు ఒకే మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. రాత్రివేళ సరైన వెలుతురు లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులు చెబుతున్నారు.

రింగ్‌రోడ్డుపై స్పష్టత ఏది

చర్ల పట్టణంలోని భారీ వాహనాల రాకపోకలను తగ్గించేందుకు రింగ్‌రోడ్డు ప్రతిపాదనపై కూడా గతంలో చర్చ జరిగింది. గాంధీ బొమ్మ సెంటర్ నుండి పోలీస్‌స్టేషన్ రోడ్డు వైపు కొత్తపల్లి, లింగాపురం మీదుగా తెగడ బ్రిడ్జి సమీపంలోని ప్రాంతాలను కలుపుతూ రహదారి అభివృద్ధి చేస్తారనే ప్రచారం జరిగింది. రహదారి పనులు చేపట్టినా అవి పూర్తిస్థాయిలో కొనసాగకపోవడంతో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రింగ్‌రోడ్డు ప్రతిపాదన అధికారికమా,అధికారికమైతే ప్రస్తుతం ఏ దశలో ఉంది,నిధులు ఎంత మంజూరయ్యాయి,పనులు ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు పూర్తవుతాయి,అనే వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

సరిహద్దు రహదారికి ప్రాధాన్యం లేదా

చర్ల మండలం ఛత్తీస్‌గఢ్ సరిహద్దుకు ఆనుకుని ఉండటంతో రహదారి ప్రాధాన్యం మరింత పెరిగింది. భద్రాచలం వైపు నుంచి చర్ల మీదుగా సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, సరుకు రవాణా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.

భద్రాచలం--చర్ల రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఇటీవల వార్తలు వెలువడిన నేపథ్యంలో చర్ల పట్టణ పరిధిలో చేపట్టబోయే పనులపై స్పష్టమైన వివరాలు ప్రకటించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ఎందుకు ఆగుతున్నాయి

చర్ల మండలంలోని కొత్తపల్లి, లింగాపురం, మొగలపల్లి తదితర ప్రాంతాల్లో రహదారి పనులు చేపట్టి మధ్యలో నిలిచిపోయిన సందర్భాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడానికి కారణం ఏమిటి,నిధుల కొరతా,



కాంట్రాక్టర్ల సమస్యా, అనుమతుల సమస్యా, భూసేకరణ అడ్డంకులా, అనే విషయాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ప్రమాదాలు పెరుగుతున్నా

చర్ల ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా బస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్, ఆయిల్‌బంక్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. రహదారి విస్తరణతో పాటు సెంటర్ లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పాదచారుల భద్రత, డ్రైనేజీ, రోడ్డు మార్కింగ్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

ప్రజలకు కావాల్సింది ప్రకటనలు కాదు

చర్ల రహదారుల విషయంలో ఎన్నో ఏళ్లుగా వివిధ సందర్భాల్లో హామీలు, ప్రతిపాదనలు, ప్రకటనలు వినిపిస్తున్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. కానీ వాటి అమలుపై మాత్రం స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో నిరాశ నెలకొంది.

# బడంగ్ పేట్ ప్రజా సమస్యలపై భగ్గుమన్న బీజేపీ

బడంగ్‌పేట్, : మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఫాగింగ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన, రాస్తారోకో నిర్వహించారు. బడంగ్‌పేట్ సర్కిల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. మహేశ్వరం ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగంపై తగిన స్థాయిలో ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు.ఎమ్మెల్యే వైఫల్యం కారణంగానే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయని ఆరోపించారు. బడంగ్‌పేట్, నాదర్‌గుల్, బాలాపూర్, మీర్‌పేట్, జిల్లెలగూడ, ప్రశాంతి హిల్స్ తదితర ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపం, ఫాగింగ్ కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

జీహెచ్ఎంసీలో విలీనం అనంతరం ఈ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు మరింత తీవ్రమయ్యాయని శ్రీరాములు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్థానిక



ఎమ్మెల్యే అసెంబ్లీలో గళమెత్తి, పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. "స్థానిక ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో ఎన్నిసార్లు మాట్లాడారు? ఆమె హయాంలో నియోజకవర్గంలో చారిత్రాత్మకంగా చెప్పుకునే ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగింది?" అని శ్రీరాములు ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల తరపున పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరసన అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులతో కలిసి శ్రీరాములు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యను కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రోడ్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు రేడియల్ రోడ్ నంబర్--26 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఫాగింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మల శ్రీకాంత్, ఇంద్ర సేన, శూరకర్ణ రెడ్డి, మహిళా నాయకురాలు మంజుల రాణి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్‌ని చూసి భయపడుతున్నారా?..

ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ని చూసి భయపడుతున్నారా..? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ని ప్రతిపక్ష డీఎంకే ప్రశ్నించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (జజుజ) జ్ఞానేశ్ కుమార్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా విపక్షాలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఊహించని రాజకీయ సెగ తగిలింది.

తమిళనాడులో ఒకప్పటి మిత్రపక్షమైన డీఎంకే పార్టీ రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించింది. డీఎంకే నేత శరవణన్ అన్నాదురై 'ఎక్స్' వేదికగా రాహుల్‌గాంధీని సూటిగా ప్రశ్నించారు. తమిళనాడులో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపుపై రాహుల్‌గాంధీ వైఖరి ఏమిటని, 'సర్' అనంతరం ఎన్నికైన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను



రద్దు చేయాలన్న మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ ఎందుకు సమర్థించడం లేదని నిలదీశారు. ఇది ఎంతటి ద్వంద్వ నీతి అంటూ తన పోస్టులో రాహుల్‌గాంధీని ఘాటుగా విమర్శించారు.



# దేశీ హాస్పిటల్స్‌పై విదేశీ పాగా

దేశీయ వైద్య సేవల రంగం మారిపోతోంది. బ్లాక్‌స్టోన్, కేకేఆర్, టీపీజీ, జనరల్ అంట్లాంటిక్, టెమాసెక్ వంటి అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు క్రమంగా దేశీయ హాస్పిటల్స్‌ను కొనేస్తున్నాయి. గత ఐదేళ్లలో ఈ సంస్థలు ఇందుకోసం 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.96,000 కోట్లు) వరకు ఖర్చు చేసినట్టు ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) అనే అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఒక నివేదికలో తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేర్ హాస్పిటల్స్ సహా మరికొన్ని హాస్పిటల్స్ ఇప్పటికే బ్లాక్‌స్టోన్, ఇతర పీఈ సంస్థల నిర్వహణలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కాగా ఈ మధ్య కాలంలోనే మెడికవర్ హాస్పిటల్స్‌ను పీఈ సంస్థ కేకేఆర్ చేజిక్కించుకుంది. ప్రస్తుతం దేశంలోని హాస్పిటల్ బెడ్స్‌లో 5 శాతం వరకు అంతర్జాతీయ పీఈ సంస్థల నిర్వహణలోని హాస్పిటల్స్ చేతిలో ఉన్నట్టు అంచనా.

ఎందుకంటే?

మన దేశంలో ప్రభుత్వ వైద్య సేవలు అంతంత మాత్రమే. ప్రపంచంలో ప్రతి 1,000 మంది జనాభాకు సగటున 3.3 బెడ్స్ ఉంటే, మన దేశంలో అది 1.3 మాత్రమే. దీనికి తోడు జీవన శైలి మార్పులతో దేశంలో ఏటికేటికి హృద్రోగాలు, క్యాన్సర్, కిడ్నీ, కాలేయ సమస్యలు పెరిగి పోతున్నాయి. ఈ సమస్యల చికిత్సకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన ఆధునిక వైద్య పరికరాలు గానీ, వసతులుగానీ లేవు. దీంతో ప్రైవేట్ హాస్పిటల్స్‌కు గిరాకీ పెరిగింది. అనేక మంది నిపుణులైన డాక్టర్లు దీన్ని అవకాశంగా తీసుకుని సొంతంగా హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వీరిలో కొందరికి పీఈ సంస్థలు పెట్టుబడులు సమకూరుస్తున్నాయి. సంపన్న, ఎగువ మధ్య తరగతి వర్గాల్లో ఎక్కువ మంది ప్రస్తుతం తమ అనారోగ్య సమస్యల చికిత్స కోసం ఈ హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.దీంతో అనేక హాస్పిటల్ చెయిన్స్ మంచి ఆదాయంతో పాటు లాభాలూ ఆర్జిస్తున్నాయి. 2017లో మణిపాల్ హాస్పిటల్స్‌లో టెమాసెక్ హోల్డింగ్స్ అనే విదేశీ పీఈ సంస్థ పెట్టుబడులు పెట్టి.. ఈ ఏడాది వచ్చిన మణిపాల్ హాస్పిటల్స్ పబ్లిక్ ఇష్యూలో కొంత వాటాను 10 రెట్ల లాభానికి అమ్ముకుంది. అంతర్జాతీయ పీఈ సంస్థలు భారతీయ హాస్పిటల్స్ చెయిన్స్‌ను కొనుగోలు చేయడం వెనక ఈ భారీ లాభాలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

# ఏఎం ఇంటెలిజెన్స్ విస్తరణ బాట



**గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఐ మౌలిక వసతుల ప్లాట్‌ఫామ్ ఏఎం ఇంటెలిజెన్స్ (ఏఎంఐ) తన డేటా సెంటర్ సామర్థ్యాన్ని... ఏఎం ఇంటెలిజెన్స్ విస్తరణ బాట**

హైదరాబాద్ : గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఐ మౌలిక వసతుల ప్లాట్‌ఫామ్ ఏఎం ఇంటెలిజెన్స్ (ఏఎంఐ) తన డేటా సెంటర్ సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు వచ్చే 15 నెలల్లో 2,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.92 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నట్టు ప్రకటించింది. భారత్, మలేషియాలో సిస్టమ్స్ ఏర్పాటు కోసం తాజాగా 20,000 ఎన్‌విడియా రుబిన్ జీపీయూల కోసం రెండు ఆర్డర్లు ఇచ్చినట్టు సోమవారం కంపెనీ తెలిపింది. హైదరాబాద్‌లోని తన తొలి ఏఐ ఫ్యాక్టరీలో 30 మెగావాట్ల సామర్థ్యాన్ని ఏర్పాటు చేయడానికి 9,000 ఎన్‌విడియా రుబిన్ జీపీయూలకు ఆర్డరు ఇచ్చినట్టు కంపెనీ ఇప్పటికే తెలిపింది. తాజా ఆర్డర్లతో కలిపి ఏఎంఐ మొత్తం సామర్థ్యం దాదాపు 29,000 జీపీయూలకు చేరుతుంది. 20,000 జీపీయూలకు ఇచ్చిన ఆర్డర్ల ద్వారా సమకూరే 70 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని భారత్, మలేషియాలో ఏర్పాటు చేయనున్నామని, వీటి డెలివరీ వచ్చే ఏడాది రెండో త్రైమాసికంలో జరుగుతుందని కంపెనీ తెలిపింది. దీంతో మొత్తం సామర్థ్యం 100 మెగావాట్లకు చేరుకోనుంది. వచ్చే 15 నెలల్లో మరో 300 మెగావాట్ల సామర్థ్యాన్ని మార్కెట్లోకి తీసుకురావాలనుకుంటున్నట్టు కంపెనీ తెలిపింది.

# వారాల తరబడి దగ్గు తగ్గడం లేదా? ఈ వ్యాధులకు సంకేతం కావచ్చు!



మారుతున్న వాతావరణం, అలర్జీల వల్ల వ్యాపించే దగ్గును చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, వారాల తరబడి ఇదే తీరుగా ఉంటే అది శ్వాసకోశ సమస్యలకు దారి తీస్తుంది. లక్షణాలు ఒకేలా అనిపించినప్పటికీ, వ్యాధి తీవ్రత వేర్వేరుగా ఉండొచ్చు. సరైన కారణాన్ని గుర్తించకుండా అంచనాలతో సొంత వైద్యం చేసుకోవడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులు, శ్వాసనాళాల సమస్యల వల్ల మాత్రమే కాకుండా, శరీరంలోని ఇతర భాగాల్లో తలెత్తే అనారోగ్యాల వల్ల కూడా దగ్గు రావచ్చు. ఆ రకాలేమిటో తెలుసుకుందాం..

ఆస్తమా: దగ్గుతో పాటు పిల్లికూతలు, ఛాతీలో బిగుతుగా ఉండటం, ఆయాసం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రాత్రి వేళల్లో, నిర్దిష్ట పరిస్థితుల్లో ఈ సమస్య మరింత ఎకువవుతుంది.

సీవోపీడీ: నిరంతరం తగ్గని దగ్గు, కఫం పడటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది సీవోపీడీకి సంకేతం. ముఖ్యంగా పొగతాగే అలవాటు ఉన్నవారిలో, కాలుష్యానికి గురయ్యేవారిలో ఇది ఎకువగా కనిపిస్తుంది.

యాసిడ్ రిఫ్లక్స్: కడుపులోని యాసిడ్ తిరోగమనం చెంది అన్నవాహిక ద్వారా గొంతులోకి చేరినప్పుడు కూడా దగ్గు వస్తుంది. చాలామందికి గుండెల్లో మంట లేకపోయినా ఈ రకమైన దగ్గు రావచ్చు.

పోస్ట్-నాసల్ డ్రిప్: ముకు లేదా సైనస్ భాగాల నుంచి శ్లేష్మం గొంతులోకి కారడం వల్ల కూడా నిరంతరం దగ్గు వస్తుంటుంది.

లక్షణాలు ఒకేలా ఉన్నంత మాత్రాన వ్యాధి ఒకటే కావాలని లేదు. పదేపదే దగ్గు వస్తుంటే దానిని సాధారణ అలెర్జీ లేదా ఇన్ఫెక్షన్‌గా భావించి, డాక్టర్ సలహా లేకుండా మెడికల్ షాపుల్లో దొరికే మందులు వాడటం సరైన పద్ధతి కాదు. దీనివల్ల అసలైన జబ్బును ప్రారంభంలోనే గుర్తించే అవకాశం కోల్పోతారు. వైద్యులు రోగి దగ్గు తీవ్రత, అది ఎంతకాలంగా ఉందో పరిశీలిస్తారు. అలాగే ధూమపానం, కాలుష్యానికి గురికావడం వంటి అంశాలను, ఇతర అనారోగ్య చరిత్రను సమీక్షించిన తర్వాతే ఎక్స్-రే, సిటి సాన్ లేదా లంగ్స్ పంక్షన్ టెస్టులు అవసరమో లేదో నిర్ధారిస్తారు.

ఈ పరీక్షలు అవసరం

ద

బ్లడ్ షుగర్: ఒబేసిటీ ఉన్నా, కుటుంబసభ్యుల్లో ఎవరికైనా రక్తంలో గ్లూకోజ్ స్థాయి ఎక్కువగా ఉన్నా, వయసు పెరిగేకొద్దీ మధుమేహానికి దగ్గర అవుతున్నట్టే. మధుమేహ కుటుంబ చరిత్ర ఉన్నవారు.. 30 ఏళ్ల నుంచే తరచూ పరీక్షలు చేయించుకోవాలి.

బ్లడ్ ప్రెషర్ (బీపీ): దేహంలో ప్రవహించే రక్తం.. నాళాలపై కలిగించే ఒత్తిడిని 'రక్త పీడనం' అంటారు. ఈ పీడన స్థాయి మన ఆరోగ్యాన్ని సూచిస్తుంది. బీపీ పెరగడం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. 18 ఏళ్లు పైబడిన వాళ్లు తరచూ బీపీ పరీక్షించుకోవాలి.

# బరువులు ఎత్తే వ్యాయామాలు చేస్తే కేవలం ప్రోటీన్లే కాదు, వీటిని కూడా తీసుకోవాలి..

బరువులు ఎత్తే వ్యాయామాలు కండరాల బలాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కండరాల నిర్మాణానికి ప్రోటీన్ ఎంత ముఖ్యమో, వ్యాయామ సమయంలో శరీరానికి శక్తిని అందించ డం, కండరాల పనితీరును మెరుగుపరచడం, వ్యాయామం తర్వాత శరీరం కోలుకోవడానికి ఇతర పోషకాలు కూడా అంతే అవసరం. బరువులు ఎత్తే సమయంలో కండరాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ సమయంలో కండరాల మరమ్మత్తు, శక్తి నిల్వల భర్తీ, శరీరంలోని ఇతర కీలక విధులు సక్రమంగా కొనసాగేందుకు సమతుల ఆహారం తీసుకోవడం అవసరం. అందువల్ల ప్రోటీన్‌తో పాటు పిండి పదార్థాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, తగినంత నీరు కూడా ఆహారంలో ఉండాలి.

పిండి పదార్థాలు, ఇతర ఆహారాలు..

వ్యాయామ సమయంలో శరీరానికి ప్రధాన శక్తి వనరుగా పిండి పదార్థాలు పనిచేస్తాయి. ఇవి కండరాలకు శక్తిని అందించడంతో పాటు బరువులు ఎత్తిన తర్వాత శరీరంలో తగ్గిన గ్లైకోజెన్ నిల్వలను తిరిగి భర్తీ చేయడంలో సహాయపడతాయి. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి సంక్లిష్ట పిండి పదార్థాలను తీసుకోవడం ద్వారా స్థిరమైన శక్తితోపాటు పీచు, విటమిన్లు, ఖనిజాలు కూడా లభిస్తాయి. తగినంత పిండి పదార్థాలు తీసుకోకపోతే శరీరం శక్తి కోసం కండరాలను ఉపయోగించే అవకాశం ఉండడంతో పాటు వ్యాయామం తర్వాత కోలుకునే ప్రక్రియ కూడా ప్రభావితమవుతుంది. అదే సమయంలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ముఖ్యమే. అవకాడో, గింజలు, విత్తనాలు, ఆలివ్ నూనె వంటి వాటిలో ఉండే కొవ్వులు హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడతాయి. కొవ్వు చేపలు, అవిసె గింజల్లో ఉండే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు వాపును తగ్గించడంలో, శరీరం కోలుకోవడంలో సహాయపడతాయి.

విటమిన్లు, ఖనిజాలు..

విటమిన్లు, ఖనిజాలు కూడా బరువులు ఎత్తేవారికి అవసరమైన సూక్ష్మ పోషకాలు. శక్తి ఉత్పత్తి, కండరాల సంకోచం వంటి ప్రక్రియల్లో ఇవి కీలకంగా పనిచేస్తాయి. కాల్షియం, విటమిన్ డి ఎముకల ఆరోగ్యానికి, కండరాల పనితీరుకు అవసరం. మెగ్నీషియం కండరాలు సడలేందుకు, శక్తి ఉత్పత్తికి సహాయపడుతుంది. కండరాలకు ఆక్సిజన్‌ను చేరవేయడంలో ఇనుము కీలకంగా ఉండడంతో, దాని లోపం అలసటకు దారితీస్తుంది. బి విటమిన్లు శక్తి జీవక్రియ, ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో భాగస్వామ్యం అవుతాయి. జింక్ కణ విభజన, ప్రోటీన్ తయారీ, కణజాల మరమ్మత్తుకు తోడ్పడుతుంది. అలాగే తగినంత నీరు తాగడం కూడా చాలా ముఖ్యం. శరీరంలో నీటి లోపం



కండరాల పనితీరును ప్రభావితం చేసి కండరాల పట్టివేతకు దారితీస్తుంది. ఎక్కువగా చెమట పట్టే వ్యాయామాల సమయంలో సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లను కూడా తగిన స్థాయిలో పొందడం అవసరం.

పండ్లు, కూరగాయలూ ముఖ్యమే..

తీవ్రమైన వ్యాయామాల సమయంలో శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. పండ్లు, కూరగాయలను వివిధ రకాలుగా తీసుకోవడం ద్వారా యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో, వ్యాయామం తర్వాత శరీరం కోలుకోవడంలో సహాయపడతాయి. బరువులు ఎత్తేవారు కండరాల పెరుగుదల కోసం కేవలం ప్రోటీన్‌పైనే ఆధారపడకుండా, పిండి పదార్థాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీటితో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలి.

# జుట్టు రాలేందుకు కేవలం పోషకాహార లోపమే కారణమా.. నిపుణులు ఏం చెబుతున్నారు..

దువ్వెనపై, దిండు మీద లేదా స్నానం చేసినప్పుడు సాధారణం కంటే ఎక్కువగా జుట్టు కనిపించడం ఆందోళన కలిగిస్తుంది. కొంతమేర జుట్టు రాలడం సహజమే అయినప్పటికీ, అకస్మాత్తుగా లేదా ఎక్కువగా జుట్టు రాలడం వెనుక వివిధ కారణాలు ఉంటాయి. జన్యుపరమైన కారణాలు, హార్మోన్లలో మార్పులు, ఒత్తిడి, అనారోగ్యం, కొన్ని మందులు, పోషకాల లోపం వంటి అంశాలు జుట్టు రాలడానికి కారణం అవుతాయి. శరీరానికి అవసరమైన పోషకాలు తగినంతగా అందకపోతే జుట్టు కుదుళ్ల సాధారణ పెరుగుదల చక్రం ప్రభావితమవుతుంది. ముఖ్యంగా ఇనుము, విటమిన్ డి, విటమిన్ బి12, ఫోలేట్, జింక్ లోపాలతో పాటు ఆహారంలో తగినంత ప్రోటీన్ లేకపోవడం కూడా జుట్టు రాలడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే జుట్టు రాలడం ఒక్కటే ఏదైనా పోషక లోపం ఉందని నిర్ధారించదు.

ఇనుము లోపిస్తే..

ఇనుము లోపం జుట్టు ఎక్కువగా రాలుతున్నప్పుడు పరిశీలించే ముఖ్యమైన పోషక సంబంధిత కారణాల్లో ఒకటి. శరీరమంతా ఆక్సిజన్‌ను తీసుకెళ్లే హిమోగ్లోబిన్ తయారీలో ఇనుము కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఇనుము నిల్వలు తగ్గడం కొందరిలో జుట్టు రాలడాన్ని పెంచుతుంది. అధికంగా రుతుస్రావం అయ్యేవారు, ఆహారం ద్వారా తగినంత ఇనుము తీసుకోనివారు, కొన్ని అనారోగ్య పరిస్థితులు ఉన్నవారు ఇనుము లోపానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. విటమిన్ డి కూడా



జుట్టు ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే విటమిన్ బి12 కణాల సాధారణ పనితీరు, ఎర్ర రక్తకణాల తయారీకి అవసరం. ముఖ్యంగా జంతు ఆహారాలను పూర్తిగా మానేసినవారిలో బి12 లోపం వచ్చే అవకాశం ఉంటుంది. ఫోలేట్ కణ విభజన, డీఎన్ఏ తయారీలో కీలకమైన పోషకం. ఆకుకూరలు, పప్పులు, బీన్స్ వంటి ఫోలేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా దాని అవసరాన్ని తీర్చుకోవచ్చు.

జింక్ కూడా ముఖ్యమే..

జింక్ కూడా రోగనిరోధక వ్యవస్థ పనితీరు, ప్రోటీన్ తయారీ, కణ విభజన వంటి అనేక ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన జింక్ లోపం జుట్టు రాలడం, జుట్టు నాణ్యతలో మార్పులతో సంబంధం కలిగి ఉంటుంది. అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో జింక్ ట్యాబ్లెట్లను తీసుకోవడం మంచిది కాదు. జుట్టు ప్రధానంగా కెరాటిన్ అనే నిర్మాణాత్మక ప్రోటీన్‌తో తయారవుతుంది కాబట్టి, ఆహారంలో తగినంత ప్రోటీన్ లేకపోవడం కూడా జుట్టు పెరుగుదలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కఠినమైన ఆహార నియమాలను పాటించడం లేదా వేగంగా బరువు తగ్గే సమయంలో ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారు ఆహారాన్ని అతిగా పరిమితం చేయకుండా, శరీరానికి అవసరమైన ప్రోటీన్‌తోపాటు ఇతర పోషకాలు కూడా తగినంతగా అందేలా చూసుకోవాలి.



# నెల రోజుల్లో సూర్య 'సీన్'..

తమిళ స్టార్ హీరో సూర్య ఈ ఏడాది వరుస విజయాలతో జోరు మీదున్నారు. 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలతో వరుసగా హిట్లు అందుకున్న ఆయన.. ఇప్పుడు ఈ ఏడాదిలో తన మూడో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిత్తు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సీన్'పై ఇప్పటికే అంచనాలు ఉన్నాయి. అయితే సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో అభిమానుల్లో మరో రకమైన చర్చ మొదలైంది. 'సీన్' సినిమాను నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

అంటే అక్టోబర్ 6 నుంచి లెక్కిస్తే సినిమాకు విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. సాధారణంగా పెద్ద హీరోల సినిమాలకు విడుదలకు కొన్ని వారాల ముందే ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయి. అయితే 'సీన్' విషయంలో మాత్రం ఇప్పటివరకు ఆ స్థాయిలో ప్రచారం కనిపించడం లేదనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. సినిమాకు సంబంధించిన టైటిల్ టీజర్ ఇప్పటికే విడుదలైంది. అయితే దాని తర్వాత ఇప్పటివరకు పెద్దగా ప్రచార కార్యక్రమాలు జరగలేదు. ముఖ్యంగా పాటలు విడుదల కాకపోవడం, ఇతర ప్రచార కంటెంట్ కూడా ప్రేక్షకుల ముందుకు రాకపోవడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా విడుదలకు నెల రోజులే మిగిలి ఉండటంతో ఇకపై ప్రమోషన్స్ ఎలా ఉండబోతున్నాయనే ప్రశ్నలు మొదలయ్యాయి. థియేట్రికల్ విడుదలకు ముందు పాటలు, ట్రైలర్, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలు, ఇతర ప్రచార కార్యక్రమాలతో సినిమాపై హైప్ పెంచడం సాధారణమే. కానీ 'సీన్' బృందం నుంచి ఇప్పటివరకు అలాంటి హడావుడి కనిపించకపోవడంతో అభిమానులు సోషల్ మీడియాలో తమ సందేహాలను వ్యక్తం చేస్తున్నారుప్రస్తుతం 'సీన్' నవంబర్ 6న విడుదల కానున్నట్లు ప్రకటించారు. ఆ తేదీకి సినిమా విడుదల కావాలంటే మిగిలి ఉన్న తక్కువ సమయంలోనే ప్రమోషన్లను వేగవంతం చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వరుస విజయాలతో మంచి ఊపులో ఉన్న సూర్య సినిమాకు తగిన స్థాయిలో ప్రచారం ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరోవైపు చిత్ర బృందం మాత్రం సరైన సమయానికి ప్రమోషన్ క్యాంపెయిన్‌ను ప్రారంభించే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి.

మరి నిజంగానే నవంబర్ 6న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? ప్రమోషన్లు ఎప్పుడు మొదలవుతాయి? అనేది రాబోయే రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 'సీన్'లో సూర్య డీఎస్పీ ఇంబరాజ్ అనే పోలీస్ అధికారిగా కనిపించను న్నారు. జిత్తు మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నజ్రియా నజీమ్, నస్లెన్, ఆనందరాజ్, లాల్, జాన్ విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# షారుక్ 'కింగ్'లో కరీనా కపూర్.. భారీ స్కెచ్‌తో స్పెషల్ సాంగ్,

## నవంబర్ 2న మరో సర్‌ప్రైజ్!





బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'కింగ్' ఒకటి. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'వార్', 'పఠాన్' వంటి భారీ చిత్రాలను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ వెండితెరకు కథానాయికగా పరిచయం కానుండటం కూడా 'కింగ్'పై భారీ అంచనాలు నెలకొనేలా చేసింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన సమాచారం బాలీవుడ్ వర్గాల్లో వైరల్‌గా మారింది. ప్రముఖ నటి కరీనా కపూర్ 'కింగ్'లో ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాదు.. ఆమె కోసం ప్రత్యేకంగా ఓ పాటను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీనా కపూర్ 'కింగ్'లో ఓ ప్రత్యేక పాటలో మెరవనున్నారు. ఈ పాటను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు చిత్రబృందం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికాలో ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ జరగనున్నట్లు సమాచారం. షారుక్ ఖాన్, కరీనా కపూర్ కాంబినేషన్‌కు ఇప్పటికే బాలీవుడ్ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. గతంలో వీరిద్దరూ కలిసి పలు చిత్రాల్లో నటించి అలరించారు. ఇప్పుడు 'కింగ్'లో వీరిద్దరూ మరోసారి తెరపై కనిపించబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రత్యేక పాటను సినిమాలోనే అతిపెద్ద ఆకర్షణల్లో ఒకటిగా నిలిచేలా భారీగా తెరకెక్కించాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో పాటు స్టార్ పవర్‌ను కూడా ఉపయోగించుకుని ఈ పాటను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఇక షారుక్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా 'కింగ్' టీమ్ మరో సర్‌ప్రైజ్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్ విడుదల..




టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. ఈ సినిమా మేకర్స్ అఫీషియల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. జానకిరామ్ మర్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ సినిమాను కోన ఫిల్మ్ కార్పొరేషన్, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు1990ల కాలం నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు మాడుగుల గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథ, పూర్తి స్థాయి పీరియాడికల్ యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. శ్రీవిష్ణు తనదైన శైలిలో వినోదం పండిస్తూనే, సరికొత్త షేడ్స్‌లో ప్రేక్షకులను అలరించనున్నారు. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా ఖూ 16ం సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# థియేటర్లలో నిరాశ.. ఇప్పుడు ఓటీటీలోకి రవితేజ మేనల్లుడి 'మారెమ్మ', రెండు వేదికల్లో ఒకేసారి స్ట్రీమింగ్




I మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన మాధవ్ భూపతిరాజు నటించిన తొలి చిత్రం 'మారెమ్మ' ఇప్పుడు ఓటీటీ బాట పట్టింది. పల్లెటూరి నేపథ్యంలో రఫ్ అండ్ టఫ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. అయితే డిజిటల్ వేదికపై మాత్రం మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో అక్టోబర్ 9 నుంచి ఈ సినిమా అందుబాటులోకి రానుంది. మరోవైపు అమెజాన్ ప్రైమ్ వీడియోలోనూ అదే రోజు నుంచి స్ట్రీమింగ్ కానుంది. దీంతో ఒకే రోజున రెండు ప్రముఖ ఓటీటీ వేదికల్లో 'మారెమ్మ' ప్రేక్షకుల ముందుకు రానుంది. థియేటర్లలో సినిమాను మిస్ అయినవారు ఇప్పుడు డిజిటల్ వేదికల ద్వారా చూసే అవకాశం లభించిందిమంచాల నాగరాజు దర్శకత్వంలో 'మారెమ్మ' తెరకెక్కింది. మయూర్ రెడ్డి బండారు నిర్మించిన ఈ చిత్రంతో మాధవ్ భూపతిరాజు హీరోగా అరంగేట్రం చేశారు. మాస్ నేపథ్యంతో కూడిన పాత్రను తొలి సినిమాకే ఎంచుకున్న మాధవ్.. నటనతో పాటు నృత్యంతోనూ ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. రవితేజ కుటుంబం నుంచి వచ్చిన హీరో కావడంతో మాధవ్ భూపతిరాజు అరంగేట్రంపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. అయితే థియేటర్లలో సినిమాకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో ఇప్పుడు ఓటీటీ విడుదలపై దృష్టి పడింది. చిత్ర కథ ఏంటంటే.. తెలంగాణలోని మహిషాపురం అనే గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని ఈ కథ సాగుతుంది. ఆ గ్రామ ప్రజలు తమ ఇలవేల్పు మారెమ్మ దేవతను ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. గ్రామ సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి ఓ పవిత్రమైన దున్నపోతును బలి ఇవ్వడం ఆనవాయితీగా ఉంటుంది. అదే గ్రామానికి చెందిన కర్ణి అనే యువకుడు 'మారి' అనే దున్నపోతును ఎంతో ప్రేమగా పెంచుతుంటాడు. సమయం దగ్గరపడిన సమయంలో ఆ దున్నపోతు అనూహ్యంగా కనిపించకుండా పోతుంది.

# మహిళలనే ఎందుకు నిందిస్తారు? సమాజంలోని డబుల్ స్టాండర్డ్స్‌పై సమంత ఘాటు వ్యాఖ్యలు



నటి సమంత రూత్ ప్రభు మరోసారి సామాజిక అంశంపై తన గళాన్ని వినిపించారు. మహిళల విషయంలో సమాజం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తూ ఆమె సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లింగ వివక్ష, పురుషాధిక్యత, మహిళలపై నిందలు వేయడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ సమాజం ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరాన్ని సమంత తన పోస్ట్ ద్వారా చెప్పినట్లు తెలుస్తోంది. ' ఇందులో సమాజంలో మహిళల విషయంలో కనిపించే కొన్ని వైరుధ్యాలను ఉదాహరణలుగా ప్రస్తావించారు. సెక్స్ వర్కర్లను మాత్రమే తప్పుపడుతూ.. వారి వద్దకు వెళ్లే క్లయింట్లను ఎందుకు ప్రశ్నించరని ఆమె నిలదీశారు. అలాగే ఒంటరి తల్లులపై సమాజం విమర్శలు చేస్తుందని, అదే స్థాయిలో ప్రశ్నించరని పేర్కొన్నారు. అత్యాచార ఘటనల విషయంలో కూడా సమాజం అనుసరిస్తున్న వైఖరిపై సమంత ప్రశ్నలు లేవనెత్తారు.